సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



ప్రగతి పరుగులు
వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో ఏలేశ్వరం పట్టణంలో ప్రగతి పరుగులు పెడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు కొత్త రూపు సంతరించుకున్నాయి. రోడ్లు, డ్రైన్లు నిర్మించారు.



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
తంటికొండలో వెంకటగిరి కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి ఈ నెల 18 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

8లో

డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులకు చేరింది.

రైటే రైటే..



రాజానగరం - బూరుగుపూడి మధ్య నిర్మించిన రహదారి

- రోడ్ల అభివృద్ధికి నిధులు
- జిల్లాలో 19 రోడ్ల పనులకు రూ.58.60 కోట్లు
- సుమారు 216 కిలోమీటర్ల మేర నిర్మాణం
- చకచకా పనులు
- వచ్చే నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: గత పాలకుల పాపం ఇప్పటికీ పీడలా వెంటాడుతూనే ఉంది. రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై నాటి టీడీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. రోడ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులను సైతం వివిధ పనులకు మళ్లించి, వాహనచోదకులకు కష్టాలను మిగిల్చింది. గద్దె దిగిపోతూ ఖజానా మొత్తం ఖాళీ చేసేసి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏవిధంగా పరిపాలిస్తారో చూస్తామంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అప్పట్లో టీడీపీ నాయకులు కూడా తప్పుడు వ్యాఖ్యలు చేశారు. అంతలోనే పులి మీద పుట్రలా కరోనా మహమ్మారి ప్రబలి ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బ తీసింది. ఇటువంటి ప్రతికూలతలకు ఎదురీదుతూ.. కష్టాల్లో ఉన్న ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూనే.. అభివృద్ధికి సైతం పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. గతంలో పలు రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసింది. ఇప్పుడు తాజాగా మరిన్ని రోడ్ల నిర్మాణాలకు సైతం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా జిల్లాకు అవసరమైన స్థాయిలో నిధులు మంజూరు చేసింది.

దీంతో పలు ముఖ్యమైన రహదారుల పనులు చురుకుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వం హయాంలో నాణ్యతా లోపంతో చేపట్టిన పలు రోడ్లు భారీ వర్షాలకు దెబ్బ తిని అధ్వానంగా మారాయి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడం.. అనుకూల వాతావరణం ఉండటంతో దెబ్బతిన్న రోడ్ల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లాలోని ఆరు రాష్ట్ర రహదారులు, 13 జిల్లా ప్రధాన, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.58.60 కోట్లు మంజూరు చేశారు. 57.1 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారుల నిర్మాణానికి రూ.22.30 కోట్లు, 159 కిలోమీటర్ల మేర 13 ప్రధాన జిల్లా, గ్రామీణ రోడ్లకు రూ.36.30 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లావ్యాప్తంగా సుమారు 216 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ కార్యాచరణ చేపట్టింది. రోడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసి, కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు చేపట్టేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా ఏకకాలంలో పలుచోట్ల రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మిగిలిన రోడ్ల నిర్మాణం కూడా త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

వచ్చే నెలాఖరుకు పూర్తి

జిల్లాలోని వివిధ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆరుస్టేట్ హైవే రహదారుల్లో సుమారు 57.10కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.22.30కోట్లు, అలాగే 13 మేజర్ డిస్ట్రిక్ట్, గ్రామీణరహదారుల్లో సుమారు 158.839కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.36.30కోట్లు మంజూరు కాగా మార్చి నెలాఖరుకు పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నాం.

– ఎస్‌బీవీ రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ, తూర్పు గోదావరి జిల్లా

రాష్ట్ర రహదారులు

రహదారి	కిలోమీటర్లు	నిధులు (రూ.కోట్లలో)
రాజానగరం – బూరుగుపూడి	10.500	3.50
రాజమహేంద్రవరం – కేశవరం (బొమ్మూరు మీదుగా)	5.200	2.20
రాజానగరం – పెడపర్తి రేవు	8.500	2.90
బిక్కవోలు – బలభద్రపురం, అనపర్తి – ద్వారపూడి, వేమగిరి – రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్	11.600	5.50
కానూరు – లంకల కోడేరు	11.000	4.20
మార్టేరు – ప్రక్కిలంక	10.300	4.00

ప్రధాన జిల్లా, గ్రామీణ రహదారులు

రహదారి	కిలోమీటర్లు	నిధులు (రూ.కోట్లలో)
కడియం – కడియపులంక (బుర్రిలంక మీదుగా), హుకుంపేట జాతీయ రహదారి – బాలాజీపేట	7.800	3.00
శాటిలైట్ సిటీ – కొత్త తుంగపాడు (సంపత్ నగరం, జి.యర్రంపాలెం మీదుగా)	16.600	2.10
రంగంపేట – సింగంపల్లి (దొడ్డిగుంట మీదుగా)	8.965	3.00
రాజమహేంద్రవరం రోడ్డు కం రైల్వే బ్రిడ్జి రోడ్డు	4.473	2.10
రాజానగరం – కలవచర్ల	21.00	2.20
శ్రీకృష్ణపట్నం – కానవరం (రాధేయపాలెం, తోకాడ మీదుగా)	15.400	2.40
కానూరు – గోపవరం	12.200	3.00
మోర్త –పెరవలి రోడ్డు (వెలగదుర్రు, తాడిపర్రు, అజ్జరం రోడ్డు వరకూ)	11.520	3.40
తేతలి – మునిపల్లి, ఊనగట్ల – బ్రాహ్మణగూడెం (కలవలపల్లి మీదుగా)	8.350	2.80
చాగల్లు – చిక్కాలపాలెం	13.350	3.30
చిట్యాల – దుద్దుకూరు, చిట్యాల – కుమారదేవం	13.121	3.00
గోపాలపురం – దొండపూడి	12.200	2.50



నిర్మాణంలో ఉన్న బొమ్మూరు బాలాజీపేట రోడ్డు

న్యూస్‌రీల్

ఏఎస్పీగా అనిల్ కుమార్



ఎస్పీ జగదీష్‌ను కలిసిన ఏఎస్పీ అనిల్ కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా శాంతిభద్రతల విభాగం అడిషనల్ ఎస్పీగా పి.అనిల్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఏఎస్పీగా పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ పి.జగదీష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరిస్తానని అనిల్ కుమార్ తెలిపారు.

బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ బీసీ సంక్షేమ పాఠశాలల్లో ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బొమ్మూరులోని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నాగవేణి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. http:www.mjpapbcwr.in వెబ్‌సైట్‌లో వచ్చే నెల 1 నుంచి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు దీనికి అర్హులని తెలిపారు.

ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలో గురువారం జరిగే జిల్లా స్థాయి ఇన్‌స్పైర్-2022, 23 ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎస్‌వీ నారాయణ మంగళవారం ఈ వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక లలితా నగర్‌లోని సీజీటీఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వాహక కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ ఎ.దుర్గా తులసీదాస్, ప్రధానోపాధ్యాయిని ఎ.లిడియా గ్రేస్, కమిటీ సభ్యులు పాల్గొని ఇన్‌స్పైర్ నిర్వహణపై చర్చించారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపిక చేసిన ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. ఎంపికైన వారు తమ ప్రదర్శనలను తమకు కేటాయించిన రూముల్లో భద్రపరచుకుని, గురువారం ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలి. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మెడికల్ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక విద్యాశాఖాధికారులకు డీఈఓ సూచించారు.

విఘ్నేశ్వరునికి సప్తనదీ జలాభిషేకం

అయినవిల్లి: విఘ్నేశ్వరుని సన్నిధిలో ప్రత్యేక క్రతువులకు వేద పండితులు మంగళవారం అంకురార్పణ చేశారు. మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక పూజలు జరగనున్నాయి. తొలి రోజు స్వామివారికి ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన 12 మంది రుత్వికులు సప్తనదీ జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలహాబాద్‌లోని త్రివేణీ సంగమం నుంచి గంగ, యమున, సరస్వతి నదీ జలాలు, తమిళనాడులోని శ్రీరంగం నుంచి కావేరి, గుజరాత్‌లోని ఓంకారేశ్వర్ నుంచి నర్మదా నది, పాకిస్తాన్‌లో సింధునది, రాజమహేంద్రవరం పుష్కరాల రేవు నుంచి గోదావరి జలాలు సేకరించి ప్రత్యేక కలశల్లో నింపి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వీటితో స్వామిని అభిషేకించారు. బుధవారం చదువుల పండగ పేరిట సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. అనంతరం స్వామివారి పాదాల చెంత లక్ష కలాలు ఉంచుతామన్నారు.

హైవే పనులు వేగంగా పూర్తి చేయాలి

సామర్లకోట: అచ్చంపేట ఏడీబీ రోడ్డు నుంచి రాజానగరం వరకూ జరుగుతున్న జాతీయ రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ అన్నారు. తిమ్మాపురం, అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు, జగ్గమ్మగారిపేట మీదుగా జరుగుతున్న ఈ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అచ్చంపేట సెంటర్ నుంచి ఏడీబీ రోడ్డు వరకూ 12 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ జరుగుతుందని చెప్పారు. ఈ మేరకు భూమి సేకరించి, జాతీయ రహదారుల నిర్మాణ అథారిటీకి అప్పగించామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతం చేయాలని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆర్డీఓ ఆదేశించారు.

కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్
భూసేకరణకు రూ. 50 కోట్లు



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అనురాధ

అల్లవరం: రెండు దశాబ్దాల కాలంగా ఊరిస్తున్న కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ పనులకు ఇక ఎలాంటి అడ్డంకులూ ఉండవని ఎంపీ చింతా అనురాధ అన్నారు. కోటిపల్లి–నరసాపురం రైల్వేలైన్ కోసం అమలాపురం రూరల్ పరిధిలో భట్నవల్లి నుంచి చించినాడ వరకు భూసేకరణ నిమిత్తం రాష్ట్ర వాటాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.50 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అల్లవరం మండలం కోడూరుపాడులో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైల్వే లైన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారని, కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించడంలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను ఎంపీగా పార్లమెంట్‌లో కోటిపల్లి–నరసాపురం రైల్వే లైన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ అధిక నిధులు కేటాయింపులు చేయించానన్నారు. 2020–21లో రూ.251 కోట్లు, 2021–22లో రూ.345 కోట్లు, 2022–23లో రూ.348 కోట్లు, 2023–24లో రూ.300 కోట్లు కేటాయించేలా చేశానని తెలిపారు. మొత్తంగా ఎంపీగా తన హయాంలో రూ.1,409 కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో కోటిపల్లి–నరసాపురం రైల్వే ప్రాజెక్టుకు రూ.300 కోట్లు, కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వే ట్రాక్ మరమ్మతులకు రూ.10 కోట్ల కేటాయింపులు జరగగా, భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 50 కోట్లు విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే కోటిపల్లి–నరసాపురం రైల్వే ప్రాజెక్టు ముందడుగు వేస్తే, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తమ వల్లే నిధులు విడుదల అవుతున్నాయని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉంద న్నారు. వారి ప్రభుత్వంలో జీవోలకే పరిమితమై, నిధులు తేవడంలో విఫలమయ్యారని, చేసింది గోరంత అయితే చెప్పుకోవడం కొండంతగా ఉందని ఎంపీ ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టిస్తుందని, తమ ప్రభుత్వ హయాంలోనే కోటిపల్లి–నరసాపురం రైలు ప్రజల ముందుకు వస్తుందని ఎంపీ అనురాధ చెప్పారు.

నేడు అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం



అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్‌బోర్డు) సమావేశం బుధవారం ఉదయం రత్నగిరిపై ప్రకాష్ సదన్ సత్రంలో జరుగుతుంది. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఈఓ కె.రామచంద్ర మోహన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు పాల్గొంటారు. ఈ సమావేశంలో 25 అంశాలపై చర్చించే అవకాశం ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలపనున్నారు. అదేవిధంగా దేవస్థానంలో గత కార్తిక మాసంలోనే ప్రారంభించాలనుకున్న జ్యోతిర్మయి వ్రతాన్ని ఇప్పటి వరకూ ప్రారంభించలేదు. దీని కోసం పాత అకౌంట్స్ విభాగాన్ని రూ.20 లక్షల వ్యయంతో ఆధునీకరించి ఏసీలు అమర్చారు. ఈ వ్రతం నిర్వహణకు దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి కూడా ఇచ్చారు. ఈ వ్రతానికి సంబంధించి వైదిక కమిటీ అభిప్రాయంపై ధర్మకర్తల మండలిలో చర్చించే అవకాశం ఉంది. అలాగే రూ.200 ప్రత్యేక దర్శనం, రూ.300 ప్రదక్షిణ దర్శనం టిక్కెట్లలో ఏదో ఒక దానిని మాత్రమే కొనసాగించే చేసే విషయమై కూడా చర్చించనున్నారు.

సమంగా అభివృద్ధి, సంక్షేమం

మంత్రి విశ్వరూప్



ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

అల్లవరం: అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమపాలన అందిస్తున్నారని, ఏ రాష్ట్రంలోనూ జరగనంత అభివృద్ధి, ఏపీలో జరిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అల్లవరం మండలంలోని అల్లవరం, కోడూరుపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలాపురం ఎంపీ చింతా అనురాధతో కలసి మంత్రి ప్రారంభించారు. అల్లవరం మొల్లేటిగరువులో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఎంపీ లాడ్స్ నిధులు రూ.15 లక్షలతో అల్లవరం పెదగరువులో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కోడూరుపాడులో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహాయంతో దేశికోడు వంతెన నుంచి రామారావుపేట వరకు రూ.51.26 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. ఇదే పంచాయతీ పరిధిలో ఆకులవారి వీధిలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి ఎంపీ అనురాధతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని 98 శాతం అమలు చేశామన్నారు. సంక్షేమ పథకాలను వివక్ష లేకుండా అందరికీ అందించామని మంత్రి విశ్వరూప్ గుర్తు చేశారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరగుతున్నాయని, తమ ప్రభుత్వంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు బొమ్ము బాలవేణి, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, ఎంపీటీసీలు నిచ్చెనకోళ్ల మౌనిక, గుబ్బల రంగనాథస్వామి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ విద్య

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం
- విద్యాహక్కు చట్టం కింద ఒకటో తరగతిలో ప్రవేశాలు



రాయవరం: విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేయడం కాకుండా, వచ్చే విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారనుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన విద్యార్థుల జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ప్రవేశాలు కల్పించేందుకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

పక్కాగా అమలు

ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022–23 విద్యా సంవత్సరంలోనే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 570 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు ఆయా మండలాల్లోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించారు. అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర విద్యాశాఖ డీఈవోల ద్వారా ఆయా పాఠశాలలకు పంపించింది. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశారు.

2024–25 విద్యా సంవత్సరానికి..

విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం ఏటా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అమలయ్యే ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవుతున్న పాఠశాలల్లో 25శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఈ నెల ఆరో తేదీ నుంచి సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాల్సిందిగా కమిషనర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు వరం



విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక వరంగా చెప్పవచ్చు. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 20వ తేదీ వరకూ సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్ అమలయ్యే ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల రిజిస్ట్రేషన్.
- ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకూ స్టూడెంట్ రిజిస్ట్రేషన్ విండో ఆన్ ది పోర్టల్.
- మార్చి 20 నుంచి 22 వరకూ స్టూడెంట్ అప్లికేషన్ ఎలిజిబిలిటీ డిటర్మినేషన్ త్రూ జీఎస్‌డబ్ల్యూఎస్ డేటా.
- ఏప్రిల్ 1న లాటరీ ద్వారా మొదటి విడత జాబితా ప్రచురణ.
- ఏప్రిల్ 2 నుంచి 10 వరకూ ఆయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ.
- ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో విడత జాబితా ప్రచురణ.
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకూ ఆయా పాఠశాలల్లో స్టూడెంట్ అడ్మిషన్ల ధ్రువీకరణ.

క్లుప్తంగా

యువత కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలి

మంత్రి దాడిశెట్టి రాజా



సాయిని అభినందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: యువత కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర రోడ్లు ,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణం దాసరి బైరాగి వారి వీధికి చెందిన యువకుడు తిరుమల నీడి సాయి అతి చిన్న వాషింగ్ మెషీన్ తయారు చేసి గిన్నిస్ బుక్‌లో రికార్డు స్థానం సాధించాడు. మంగళవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను కలిశారు. గిన్నిస్ బుక్‌లో స్థానం సాధించిన సాయిను మంత్రి రాజా అభినందించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ 37 మిల్లీ మీటర్ల పొడవు, 41 మి.మీ వెడల్పు, 43 మి.మీ ఎత్తు, 33 గ్రాముల బరువుతో అతి చిన్న వాషింగ్ మెషీన్ తయారు చేశానని చెప్పాడు. పాలిటెక్నిక్ మెకానికల్ పూర్తి చేసిన సాయి గతంలో అతి చిన్న ఎయిర్ కూలర్ తయారు చేసి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాడు. గిన్నిస్ బుక్‌లో స్థానం సాంధించాలన్న లక్ష్యంతో 5 గ్రాముల డీసీ మోటారు, ఫోమ్‌బోర్డు, ప్లాస్టిక్ పైపు, 4 వాల్ట్స్ బ్యాటరీ, చిన్న ఎల్ఈడీ, మైక్రో స్విచ్ తదితర వాటిని వినియోగించి 45 నిమిషాల 39.9 సెకండ్లలో ఈ వాషింగ్ మెషీన్‌ను తయారు చేశానన్నాడు. గతేడాది జూన్‌లో పంపించగా ఇటీవల నిర్వాహకులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం కల్పిస్తూ ధ్రువపత్రం పంపించారని తెలిపాడు. జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ అల్లాడ దివాణం అభినందించారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి

బిక్కవోలు: మండలంలోని ఇలపల్లి గ్రామానికి చెందిన బల్లి సురేష్(24) పురుగు మందు తాగి మృతిచెందినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇలపల్లి గ్రామానికి చెందిన బల్లి సురేష్‌కు మార్చి 27న వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి పనులు జరుగుతున్న సమయంలో ఆదివారం రాత్రి స్నేహితులకు ఫోన్ చేసి నేను పురుగు మందు తాగాను.. రక్షించండి అంటూ చెప్పడంతో వెంటనే అతని వద్దకు వచ్చి సురేష్‌ను రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. అక్కడ దీంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఏలేశ్వరం సెంటర్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆధునిక మరుగుదొడ్లు



జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తరగతి గది



షిర్డీనగర్‌లో అభివృద్ధి చేస్తున్న పార్కు

ప్రగతి పరుగులు

- అభివృద్ధి పథంలో ఏలేశ్వరం నగర పంచాయతీ
- రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అనేక పనులు
- రూపుమారిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు



కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనం

ఏలేశ్వరం: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గెలిచిన వెంటనే పక్కన పెట్టే రోజులకు స్వస్తిపలికి మేనిఫెస్టో పరమావధిగా పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఏలేశ్వరం పట్టణ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు రూపు మార్చుకుని ప్రగతికి చిహ్నంగా నిలుస్తున్నాయి. నగర పంచాయతీలో సీఎం జగన్ పాలనలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగింది. పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే పింఛన్ నుంచి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ తోడు, నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధిని కళ్లకు కట్టినట్టుగా సీఎం జగన్ చూపించారు.

కోట్లాది రూపాయలతో పనులు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు నిర్వహించారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.20 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.68 కోట్లతో అనేక సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మించారు.నాడు- నేడు పథకంలో భాగంగా రూ.3 కోట్లతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతన భవనాలతో పాటు పాత భవనానికి మరమ్మతులు నిర్వహించారు. రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనాన్ని నిర్మించారు. స్థానిక షిర్డీనగర్‌లో రూ.17.40 లక్షలతో నూతనంగా పార్కు నిర్మించి ఆటవస్తువులను అమర్చారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

నాడు-నేడు పథకంలో పట్టణంలోని 11 ప్రభుత్వ పాఠశాలలకు గాను 10 పాఠశాలలను సుమారు రూ.6.16 కోట్లతో అభివృద్ధి చేశారు. పాఠశాలల్లో ఎన్నడూ లేని విధంగా ఫర్నీచర్ సమకూర్చారు. నూతన భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మించారు.

పట్టణ ముఖచిత్రం

విస్తీర్ణం:	6.54 చదరపు కిలోమీటర్లు
జనాభా :	32,084
పురుషులు :	15,610
మహిళలు :	16,474
వార్డులు :	20
కుటుంబాలు :	7వేలు
ఓటర్లు :	24,489
పురుషులు :	11,698
మహిళలు :	12,787
ఇతరులు :	నలుగురు
కుళాయిలు :	799
పింఛన్లు :	3,878
అందించే నగదు :	రూ.1,16,45,500
రహదారులు :	75.20 కిలోమీటర్లు
సీసీ రోడ్లు :	64.45,
బీటీ రోడ్లు :	5.99
ఆర్అండ్‌బీ రోడ్లు :	6.86
సచివాలయాలు :	9
సిబ్బంది :	90
వలంటీర్లు :	139
కమ్యూనిటీ హెల్త్ సెంటర్ :	1
అర్బన్ హెల్త్ సెంటర్ :	1
ప్రభుత్వ డిగ్రీ కళాశాల :	1
ప్రభుత్వ జూనియర్ కళాశాల :	1
ప్రభుత్వ పాఠశాలలు :	11
హైస్కూళ్లు :	3
ప్రాథమిక పాఠశాలలు :	8
హైస్కూళ్లలో విద్యార్థులు :	2,108
ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు :	695

మహిళలకు అండగా

పట్టణంలోని మహిళలకు మెప్మా ద్వారా ప్రభుత్వం అనేక పథకాలు అందజేసింది. పట్టణ పరిధిలో 890 డ్వాక్రా సంఘాలు ఉండగా 8,784 మంది సభ్యులుగా ఉన్నారు. వారికి వైఎస్సార్ చేయూత ద్వారా రూ.9.70 కోట్లను ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.17.54 కోట్లు, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.5.02 కోట్లు అందించారు. జగనన్న తోడు ద్వారా రూ.6.38 కోట్లు లబ్ధిదారులకు అందజేశారు.

ప్రభుత్వ నిధులతో పట్టణాభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశాం. కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైన్లు వేశాం. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేశాం.

– కె.శ్రీనివాసరావు, కమిషనర్, నగర పంచాయతీ ఏలేశ్వరం

సీఎం జగన్ పాలనలో..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పట్టణంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా పేదప్రజలందరికి సంక్షేమ పథకాలు అందజేశాం. సీఎం జగన్ పాలన ఆదర్శవంతంగా నిలిచింది.

– వరుపుల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్

వ్యక్తి దుర్మరణం



రాజేష్ మృతదేహం

ఐ.పోలవరం: యానాం-ఎదుర్లంక బాలయోగి వారధిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం మురమళ్ల నుంచి యానాం వైపు వెళుతున్న కారు యానాం నుంచి అమలాపురం వైపు వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కె.రాజేష్ (50) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి హేమంత్‌కుమార్ గాయాలపాలై యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరిదీ భట్నువల్లి గ్రామం. ఎస్సై భానుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ (మెయిన్స్)-2024 ఫలితాలలో ప్రతిభ



విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: జనవరి నెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ముగ్గురు విద్యార్థులు యు.సుధీర్, ఎస్.యశ్వంత్, ఎంజీవీ మహేష్ 99.99 పర్సంటైల్‌ను సాధించారని చెప్పారు. ఆర్.పవిత్ర 99.96, బి.సాయినరేన్ 99.96,ఎం.వినేష్‌కుమార్ 99.93, ఎంఆర్ ఎస్‌వీఎస్ శ్రీ మణికంఠ 99.93, బి.నవదీప్‌పవన్ 99.92, జీఎస్ దుర్గాసాయి 99.92, కె.సిద్ధార్థ 99.90, ఎస్.హార్థిక్ 99.90 పర్సంటైల్‌ను సాధించారన్నారు. 99.90 పర్సంటైల్ పైన 11మంది, 99.0పర్సంటైల్ పైన 120మంది, 98పర్సంటైల్ పైన 217మంది, 95పర్సంటైల్ పైన 463 మంది, 90పర్సంటైల్ పైన 756 మంది సాధించారని తెలిపారు. సుమారు 650పైన విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌లతో ఎన్ఐటీ లేదా ఐఐటీలలో సీట్లు సాధించగలరని ఆయన తెలిపారు. విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

అతడు 40 కేసుల్లో నిందితుడు

చేబ్రోలులో దొరికిన దొంగను విచారిస్తున్న పోలీసులు

పిఠాపురం: అతని కళ్లు పడ్డాయంటే ఆ ఇల్లు గుల్ల కావాల్సిందే. చుట్టు జనం ఉన్నా అతి చాకచక్యంగా ఇంటిని కొల్లగొట్టడంలో దిట్ట. కాని చిన్న దొంగతనం చేస్తూ స్థానికులకు దొరికి పోయాడు. తీరా పోలీసులు విచారిస్తుంటే విస్తుబోయే నిజాలు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం హరేరామ గుడి దగ్గరలో నివాసముంటున్న బొమ్మిడాల కామేశ్వరరావు ఇంటి దగ్గరకు వెళ్లి ఇంటికి వేసి ఉన్న తాళాలను ఇనుప ఊచతో పగులగొట్టడానికి ప్రయత్నించాడు. ఇంతలో చుట్టుపక్కల వారు వచ్చి దొంగతనానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు గొల్లప్రోలు పోలీసులు వచ్చి అతనిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తి గూడూరుకు చెందినవాడు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల పోలీసు స్టేషన్లలో 40కి పైగా కేసులున్నట్లు గుర్తించారు. కాకినాడ జిల్లాలోనే పలు గ్రామాల్లో వివిధ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నట్లు తెలిసింది. ముందుగా గ్రామాల్లో తిరుగుతూ ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళుతుంటే గమనించి ఆ ఇళ్లను దోచుకుంటాడని పోలీసులు గుర్తించారు. చేబ్రోలులో దొంగతనానికి ప్రయత్నించినప్పుడు మద్యం మత్తులో ఉండడం వల్ల పట్టు బడినట్లు చెబుతున్నారు. చేబ్రోలులో దొంగతనం చేస్తుండగా చూసిన వారు పట్టుకునే ప్రయత్నం చేయగా తనకు దీర్ఘకాలిక రోగాలున్నాయని నన్ను పట్టుకుంటే మీకు అంటుకుంటాయంటూ బెదిరించినట్లు స్థానికులు తెలిపారు. అయితే అదంతా తప్పించుకునేందుకు వేసే పన్నాగంలో భాగమని పోలీసులు చెబుతున్నారు. దొరికిన వ్యక్తితో పాటు ఇంకా ఎవరైనా వచ్చారా? వస్తే వాళ్లు ఎక్కడ ఉన్నారు? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం భద్రం.. నగదు చోరీ

సామర్లకోటలో పట్ట పగలే దొంగతనం



వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీము



ఇంట్లో భద్రంగా ఉన్న బంగారు ఆభరణాలు

సామర్లకోట: తాళం వేసి ఉన్న ఇంటిలో పట్ట పగలే చోరీ చేసిన సంఘటన ఇది. స్థానిక ఉప్పువారి వీధిలో నివాసం ఉంటూ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న దూళ్ల చంద్రమౌళి మంగళవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. భార్య కుమారి, చిన్న కుమారుడు అంజనీ కాకినాడ రూరల్ నేమాంలోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లారు. పెద్ద కుమారుడు చంద్రశేఖర్ బంధువుల పెళ్లికి వెళ్లడానికి విశాఖపట్నం నుంచి సామర్లకోటలోని ఇంటికి వచ్చాడు. అయితే ఇంటి తలుపులు తెరచి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా కుడి వైపు ఉన్న తలుపు గెడ, తాళం పగులు కొట్టి ఉంది. దాంతో విషయాన్ని తండ్రి చంద్రమౌళికి తెలియజేశాడు. హుటాహుటిన ఇంటికి చేరుకున్న చంద్రమౌళి బీరువాలు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. ఇటీవల ఇంట్లో జరిగిన పెళ్లి ఫొటోలకు ఇవ్వడానికి ఇంటిలో ఉంచిన రూ.50 వేల నగదు దొంగతనానికి గురి అయినట్టు చంద్రమౌళి తెలిపాడు. బీరువాలో ఉంచిన 108 గ్రాముల బంగారం భద్రంగా ఉండటంతో పోలీసులతో పాటు బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక, పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీము రంగంలోకి దిగి వేలి ముద్రలను సేకరించింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు ఆ ప్రాంతంలో తిరిగారని, వారే దొంగతనానికి పాల్పడి ఉండవచ్చునని స్థానికులు తెలిపారు. ఇనుప ఊచతో గెడ తొలగించినట్టు పోలీసులు తెలిపారు.

కో లొకేటెడ్ పాఠశాలల పరిశీలన



కో లొకేటెడ్ పాఠశాలలను పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ ప్రతిష్ట

రాయవరం: ప్రాథమిక, పూర్వ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ఫౌండేషన్, లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తోందని సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకులు ప్రతిష్ట పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాథమి, పూర్వ ప్రాథమిక పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉన్న కో లొకేటెడ్ పాఠశాలలను ఆమె సోమ, మంగళవారాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ 1 నుంచి 8 లోపు చిన్నారులకు చదవడం, రాయడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలపై పూర్తి అవగాహన కలిగించేందుకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులు బోధన చేసే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా జ్ఞానజ్యోతి, జ్ఞాన ప్రకాష్ అనే రెండు కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రతీ మండలం నుంచి ఆరుగురు డీఆర్‌పీలను ఎంపిక చేసి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. కో లొకేటెడ్ పాఠశాలలను పరిశీలన అనంతరం నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించనున్నట్టు చెప్పారు. ప్రతీ జిల్లా నుంచి ఒక కో లొకేటెడ్ పాఠశాలను ఎంపిక చేసి వాటి మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కో లొకేటెడ్ పాఠశాలల పరిశీలనలో భాగంగా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులు ఏ విధంగా ఉన్నాయి, విద్యార్థుల సంఖ్యను మోడల్ పాఠశాలల ఎంపిక చేస్తున్న సందర్భంగా ఆయా పాఠశాలలకు ఉన్న అర్హతలను ప్రధానంగా ఆమె పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో టీచర్‌లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె వెంట ప్రథమ్ అసోసియేట్ ప్రోగ్రామర్ పృధ్వీ, మూడు జిల్లాల ఏఎంవోలు గౌరీశంకర్, రామారెడ్డి, రాంబాబు, ఆయా జిల్లాలకు సంబంధించిన ఐసీడీఎస్ అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


కిర్లంపూడి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై మంగళవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఏఎస్సై రామకృష్ణ మూర్తి తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి మండల పరిధి రాజుపాలెం పెట్రోల్ బంక్ వద్ద ఎదురెదురుగా మోటార్ సైకిళ్లపై వస్తున్న బల్ల వీరశివ, చీకట్ల సుబ్రహ్మణ్యం అదుపు తప్పి బలంగా ఢీకొట్టుకున్నారు.

దీంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బల్ల వీరశివ(21)ను మెరుగైన వైద్యం కోసం కాకినాడ మెడికవర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. దీంతో మృతుడు సోదరుడు బల్ల రామచక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన బ్రిడ్జి దిగువన సోమవారం అర్ధరాత్రి మోటారు సైకిల్ అదుపు తప్పి రైలింగ్‌ను ఢీకొట్టి జలాది శ్రీనేష్ కుమార్(35) అనే సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందారు. చాగల్లు మండలం మల్లవరానికి చెందిన అతను రాజమహేంద్రవరం నుంచి మోటారు సైకిల్‌పై వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. తల రోడ్డుకి బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ప్రస్తుతం గర్భవతి. ఆయన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు లో కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. స్వగ్రామంలో బంధువు చనిపోవడంతో మూడు రోజుల క్రితం వచ్చారు. సోమవారం రాత్రి రాజమహేంద్ర వరం వెళ్లి తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి నుంచి తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి

గోకవరం: తంటికొండ వెంకన్న 64వ దివ్య బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాడు. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 18 వరకు ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

పూజా కార్యక్రమాలు:

14వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రెండవ రోజు గురువారం లక్ష తులసి పూజ, మహాశాంతి, లక్ష్మీవేంకటేశ్వర హోమం, శ్రీవారి కల్యాణం, మూడవ రోజు శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులతో సామూహికంగా పాలు పొంగించే కార్యక్రమం నిర్వహిస్తారు. నాల్గవరోజు శనివారం ప్రత్యేక పూజలతో పాటు శ్రీలక్ష్మీనారసింహ సహిత మహా సుదర్శన హోమం, బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆదివారం చక్రస్నానం, పూర్ణాహుతి జరుగుతుంది. ఈ నెల 19న సోమవారం ఉదయం 8 నుంచి స్వామి వారి గ్రామోత్సవం, 20న మంగళవారం స్వామి వారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), ఈఓ గండి వెంకటలక్ష్మీకుమార్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో సత్తా



అత్యధిక పర్సంటైల్స్ సాధించిన శ్రీ షిర్డీ సాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రాజమహేంద్రవరం శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో తమ సత్తా చాటారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న బి.తనుశ్రీ 99.9 పర్సంటైల్ సాధించగా, జె.శ్రీకర్ 99.8, సీహెచ్ భాను వెంకట దీపక్ 99.6, ఎం.తాత్విక్ సాయి, 99.4, కె.ప్రదీప్ శ్రీసత్య 99.4, బి.లక్ష్మణ్ నాయుడు 99.3 పర్సంటైల్‌తో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఆరుగురు విద్యార్థులు 99 శాతం పైగా పర్సంటైల్ సాధించగా 15 మంది 98 పైగా, 28 మంది 97 పైగా, 53 మంది 95 పైగా పర్సంటైల్ సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన 220 మంది విద్యార్థులలో 74 శాతం , 163 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

జేఈఈ మెయిన్-2024 ఫలితాలలో ప్రభంజనం



99.92 పర్సంటైల్ సాధించిన శ్రీహర్షిత్‌ను అభినందిస్తున్న శశి చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్-2024 ఫలితాలలో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మంగళవారం తెలిపారు. జె.శ్రీహర్షిత్ 99.92 పర్సంటైల్, సీహెచ్. పురంధర్‌సత్య 99.91, ఎస్.నాగేశ్వర విశ్వాంత్ 99.89, పి.నితీష్ శ్రీసత్య 99.88, ఎల్.ఉదయ కిరణ్ 99.87, బి.గరిమ 99.85, ఎస్.లక్ష్మి నిష్కల్ 99.82, కెపిటిఎస్.వంశీకృష్ణ 99.80, ఎ.యశ్వంత్ కేదార్ కుమార్ 99.78, బి.పవన్ 99.76, డి.వి.చంద్ర 99.75, ఎ.అజితేష్ 99.72, కె.సంజయ్ పవన్ 99.71, పి.నిఖిల 99.71, కెడి.కరుణ్ లక్ష్మణ్ 99.62, బి.పురంధర్ 99.55, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి 99.52, జిఎం.రంగనాథ్‌రెడ్డి 99.51 పర్సంటైల్‌తో పాటు 99 పర్సంటైల్ పైన 40 మంది, 95 పర్సంటైల్ పైన 130 మంది, 90 పర్సంటైల్ పైన 221 మంది సాధించారని రవికుమార్ తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మిసుప్రియ అభినందించారు.